క్లుప్తంగా

లక్ష్మీ నరసింహునికి పుష్పయాగ పూజలు



కోరుమిల్లిలో విశేష అలంకరణలో లక్ష్మీ నరసింహస్వామి

కపిలేశ్వరపురం: మండలంలోని కోరుమిల్లిలోని శ్రీలక్ష్మీ నరసింహస్వామి కల్యాణోత్సవాల్లో భాగంగా శుక్రవారం రాత్రి శ్రీపుష్పయాగం పూజలు నిర్వహించారు. వేద పండితులు స్వామిని విశేషంగా అలంకరించారు. స్వామిని గ్రామంలో ఊరేగించారు. గ్రామానికి చెందిన భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

సకాలంలో విద్యా కానుకల పంపిణీ



అంగర జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఎంఈఓ తదితర అధికారులతో చర్చిస్తున్న మధుసూధనరావు

కపిలేశ్వరపురం: నూతన విద్యా సంవత్సరంలో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు సకాలంలో విద్యా కానుకలను అందజేసేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్టు సమగ్ర శిక్షా ఏపీసీ అండ్ డిప్యూటీ కలెక్టర్ ఎ.మధుసూదనరావు తెలిపారు. మండలంలోని అంగర జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన విద్యా కానుకల స్టాక్ పాయింట్‌ను శనివారం ఆయన సందర్శించారు. మండలంలోని ప్రభుత్వ పాఠశాలల నిర్వహణ, చేరికలు, పాఠ్య పుస్తకాలు, నాడు- నేడు పనుల నిర్వహణ తదితర అంశాలను ఎంఈఓ కె.తాతారావు వివరించారు. శాస్త్రీయ పద్ధతిలో ప్రభుత్వ పాఠశాలలను నిర్వహించాలని ఏపీసీ మధుసూదనరావు ఆదేశించారు. ఆయన వెంట సీఎంఓ బీవీవీ సుబ్రహ్మణ్యం, ఏఎంఓ పిల్లి రాంబాబు, పాఠశాల హెచ్ఎం అంగర రాజు ఉన్నారు.

హాజరు 16, గైర్హాజర్ 42 మంది

మండపేట: పదో తరగతి అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థుల కంటే గైర్హాజరయ్యే వారే ఎక్కువగా ఉండడం విశేషం. శనివారం నాటి హిందీ పరీక్షకు మండల వ్యాప్తంగా 58 మంది విద్యార్థులు హాజరు కావలసి ఉండగా, కేవలం 16 మంది మాత్రమే హాజరైనట్టు మండల విద్యాశాఖాధికారి నాయుడు రామచంద్రరావు తెలిపారు. మొత్తం 42 మంది విద్యార్థులు డుమ్మా కొట్టారని పేర్కొన్నారు.

మనబడి నాడు-నేడు పనుల పరిశీలన



కోటిపల్లిలో నాడు-నేడు పనులు పరిశీలిస్తున్న ఏపీసీ మధుసూదనరావు

కె.గంగవరం: మనబడి నాడు-నేడు పనులను డిప్యూటీ కలెక్టర్, సమగ్ర శిక్ష అదనపు ప్రాజెక్టు కోఆర్డినేటర్ ఎ.మధుసూదనరావు శనివారం మండలంలో పరిశీలించారు. మండలంలోని కోటిపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న నాడు-నేడు పనులను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. మధుసూదనరావు మాట్లాడుతూ జూన్ 12న పాఠశాలలు పునః ప్రారంభం కానున్నందున ఆ సమయానికి పనులను పూర్తి చేసుకునే విధంగా వేగవంతం చేయాలన్నారు. విద్యుద్దీకరణ, టాయిలెట్స్, మేజర్ అండ్ మైనర్ పనులు తుది దశకు చేరుకున్నట్లు ఉపాధ్యాయులు తెలిపారు. పనులను పూర్తి చేయడంతో పాటు ఎప్పటికప్పుడు పనుల ప్రగతిని యాప్‌లో అప్‌లోడ్ చేయాలని ఏపీసీ ఉపాధ్యాయులకు సూచించారు. ఆయన వెంట సమగ్ర శిక్షా కమ్యూనిటీ మొబలైజేషన్ ఆఫీసర్ బీవీవీ సుబ్రమణ్యం, ఏఎంఓ పి.రాంబాబు, సహిత విద్య జిల్లా కోఆర్డినేటర్ ఎంవీవీ సత్యనారాయణ ఉన్నారు.

కండక్టర్ శ్రీనివాసరావు కుటుంబాన్ని ఆదుకోవాలి

అమలాపురం రూరల్: పి.గన్నవరం మండలం ఉడిమూడి వద్ద రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన కండక్టర్ కడలి శ్రీనివాసరావు కుటుంబాన్ని ఆదుకోవాలని యునైటెడ్ వర్కర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఎ.శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి కె.ప్రకాశరావు కోరారు. శనివారం వారు శ్రీనివాసరావు కుటుంబ సభ్యులను పరామర్శించి తమ సంతాపం తెలియజేశారు. ఈ సందర్భంగా వారిద్దరూ మాట్లాడుతూ శ్రీనివాసరావు ఆన్‌డ్యూటీలో ఉండగా జరిగిన ప్రమాదంలో తీవ్రంగా గాయపడి విషమ స్థితికి చేరుకున్నా ఆర్టీసీ నుంచి సరైన వైద్య సహాయం అందలేదని ఆరోపించారు. అతడి కుటుంబసభ్యులు వైద్యానికి లక్షల రూపాయలు ఖర్చు పెట్టినా ఆర్టీసీ నుంచి కేవలం రూ.5,000 మాత్రమే ఇవ్వడం దారుణమన్నారు. డ్రైవర్‌కు సరైన విశ్రాంతి లేకుండా డ్యూటీ వేయడం వల్లే ప్రమాదం జరిగిందని చెప్పారు. శ్రీనివాసరావు కుటుంబ సభ్యులకు నష్ట పరిహారంతో పాటు ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు.

ఆ గడ్డిలో పోషకాలు తగ్గవు

- త్వరితగతిన జీర్ణం అవుతుంది
- కోత యంత్రం గడ్డిని దాణాగా వాడవచ్చు
- గడ్డివామిగా వేస్తే ఏడాది పొడవునా వాడుకోవచ్చు
- చేలల్లో తగుల బెట్టడం వల్ల భూమికి నష్టం



యంత్రంతో కోయగా పంట పొలంలో వదిలేసిన వరి గడ్డి



పశు గ్రాసంగా పనికిరాని గడ్డిని పొలంలో తగలబెట్టడం భూమికే చేటు

రాయవరం: ఇప్పుడు ఎక్కడ చూసినా యంత్రాలపైనే వరి కోతలు కోస్తున్నారు. వరికోతలతో కోసిన గడ్డిని వాడేందుకు పశు పోషకులు ముందుకు రావడం లేదు. దీంతో రైతులు యంత్రాలతో కోసిన వరిగడ్డిని పొలంలోనే వదిలేస్తున్నారు. ఆ గడ్డికి రైతులు మంటపెడుతున్నారు. దీని వలన గడ్డి వృథాగా పోవడమే కాదు..ఆ గడ్డిని మంట పెట్టడం వలన పొలానికి చేటు కలిగిస్తోంది.

భారంగా పశుపోషణ

విపరీతంగా పెరిగిపోతున్న పశువుల దాణా ధరల కారణంగా గ్రామీణ ప్రాంతాల్లో పశుపోషణ రైతులకు తీవ్ర భారంగా మారుతోంది. పశువులకు దాణాగా ఉపయోగించే తవుడు, చిట్టు, ఉలవలు, వేరుశనగపిండి వంటి వాటితో పాటు ఇటీవల ఎండు గడ్డి ధరలు కూడా విపరీతంగా పెరిగిపోయాయి. దీనికి తోడు వరి పంట మాసూళ్లలో వ్యవసాయ కార్మికుల ఖర్చు విపరీతంగా పెరిగి పోవడంతో ఎక్కువ మంది రైతులు కోత యంత్రాల బాట పట్టారు. యంత్రాల ద్వారా మాసూళ్లు చేయడంతో వరి గడ్డి ముక్కలు ముక్కలుగా మారి నలిగిపోతోంది. దీంతో ఎక్కువ మంది రైతులు గడ్డిని చేలల్లోనే తగుల బెట్టడం పరిపాటిగా మారిపోయింది. ఈ కారణంగా వరి గడ్డి కొరత ఏర్పడి దాని ధర కూడా పెరిగి పోతోంది.

రైతులకు నష్టం..

వరికోత యంత్రాల ద్వారా పంట మాసూళ్లు చేసిన పొలాల్లో అనేక మంది రైతులు గడ్డి ఎండిన తర్వాత తగులబెడుతున్నారు.

అయితే చేలల్లో గడ్డిని తగలబెట్టడం వల్ల భూమికి ఉపయోగపడే సూక్ష్మక్రిములు సైతం చనిపోతాయి. నాట్లు వేసిన సమయంలో వరి పైరును తెగుళ్లు ఆశిస్తాయి. అందువల్ల చేలల్లోని గడ్డిని తగులబెట్టకుండా ఒబ్బిడి చేసుకోవడమే ఉత్తమం.

అపోహ మంచిది కాదు



వరికోత యంత్రాల ద్వారా మాసూళ్లు చేస్తున్న రైతులు గడ్డి ముక్కలు కావడంతో పశువుల దాణాగా ఉపయోగించడం లేదు. ఆ గడ్డిలో పోషక విలువలు ఏ మాత్రం తగ్గవు. యంత్రాల ద్వారా మాసూళ్లు చేస్తున్నందున గడ్డి కొంత మెత్తగా, ముక్కలు, ముక్కలుగా మారుతోంది. పశువులు గడ్డిని తినడానికి సులువుగా ఉండడమే కాక త్వరగా జీర్ణమవుతుంది. గడ్డి యంత్రంలో నలిగి పోతున్నందున పశువులకు పనికిరాదనే అపోహ మంచిది కాదు. యంత్రం ద్వారా పంటను మాసూళ్లు చేసిన తర్వాత గడ్డిని చేలల్లోనే నాలుగైదు రోజులు ఎండనిచ్చి తర్వాత కట్టలు కట్టి గడ్డివామిగా వేసుకుని ఏడాది పొడవునా పశువులకు దాణాగా వేయవచ్చు.

– డాక్టర్ ఎ.నాగశ్రావణి, పశువైద్యాధికారి, మాచవరం, రాయవరం మండలం

సందట్లో సడేమియా..



నల్లూరు-కాలేరు రహదారిలో చెట్లు నరికి ట్రాక్టర్‌పై వేసిన దృశ్యం

- గాలికి ఒరిగిన చెట్ల కొమ్మల పేరుతో మొదళ్ల తరలింపు
- అక్రమంగా తరలిస్తున్నారంటూ ఉప సర్పంచ్ ఆరోపణ



తరలించేందుకు నరికిన చెట్ల కొమ్మలు

కపిలేశ్వరపురం: తుపాను ప్రభావంతో ఈదురు గాలులు వీస్తున్నాయి. వారం రోజులుగా ఏదో ఒక సమయంలో వర్షం కురుస్తోంది. రహదారుల వెంబడి ఉన్న చెట్ల కొమ్మలు విరిగి పడుతున్నాయి. ఆ పేరుతో కొందరు సందట్లో సడేమియా అన్నట్టు అక్రమాలకు పాల్పడుతున్నారు. ఇటీవల మండలంలోని నల్లూరు-కాలేరు రహదారి వెంబడి ఉన్న చెట్ల కొమ్మలు ఈదురు గాలులకు విరిగిపడ్డాయి. నల్లూరు, పడమర ఖండ్రికకు చెందిన ఇద్దరు వ్యక్తులు విరిగిన కొమ్మలు తొలగిస్తున్నామన్న పేరుతో అక్రమాలకు పాల్పడినట్టు కాలేరు ఉప సర్పంచ్ పలివెల పద్మావతి శనివారం ఆరోపించారు. యథేచ్ఛగా కట్టర్‌తో చెట్ల మొదళ్లను నరికి ట్రాక్టరుపై తరలించుకుపోయారు. సుమారు 15 చెట్ల వరకూ తరలించుకుపోయారు. తరలిస్తుండగా పలువురు ప్రశ్నించగా రహదారికి అడ్డంగా ఉన్న కొమ్మలను తొలగించమని ఆర్అండ్‌బీ శాఖ అధికారులు చెప్పారని సమాధానమిచ్చారు. చెట్లను ఇటుక బట్టీలకు విక్రయించినట్టు సమాచారం. చెట్లు నరికివేతపై ఆర్ అండ్ బీ అధికారుల దృష్టికి తీసుకెళ్లానని, చర్యలు తీసుకోవాలని కోరినట్టు ఉప సర్పంచ్ పద్మావతి తెలిపారు.

విద్యుదాఘాతంతో వృద్ధుడి మృతి



సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న వీఆర్వో, గొల్లపాలెం పోలీసులు

కాజులూరు: మండలంలోని బందనపూడి గ్రామ శివారు మొగలిపాలెంలో విద్యుదాఘాతానికి గురై ఓ వృద్ధుడు మృతి చెందాడు. ఈ సంఘటనకు సంబంధించి గొల్లపాలెం పోలీసులు, స్థానికులు తెలిపిన పూర్తి వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన కాలకురచ సుబ్బారావు (102)కి గత కొన్నేళ్ల క్రితం భార్య చనిపోయింది. ముగ్గురు కుమారులు ఉండగా వృత్తి రీత్యా ఇద్దరు రాజమహేంద్రవరంలోనూ, ఒక్కరు మిర్యాలగూడలోనూ నివాసముంటున్నారు. సుబ్బారావు ఒక్కరే గ్రామంలోని తన సొంత ఇంటిలో ఉంటున్నాడు. శుక్రవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి తన ఇంటి ఎదుటతోటలో చెట్టుకొమ్మలు కొబ్బరి ఆకులు విరిగి చెల్లాచెదురుగా పడ్డాయి. దీంతో శనివారం ఉదయం విరిగిపోయిన చెట్టుకొమ్మలు, కొబ్బరి ఆకులు తొలగించేందుకు తోటలోనికి వెళ్లాడు. ఈదురుగాలులకు చెట్టుకొమ్మలతో పాటు విద్యుత్ వైర్లు తెగిపడ్డాయి. అది గమనించని సుబ్బారావు వైర్లు పట్టుకుని విద్యుదాఘాతానికి గురయ్యాడు. మధ్యాహ్న సమయంలో అటుగా వెళ్లిన ప్రైవేటు ఎలక్ట్రీషియన్ సత్తిబాబు విగతజీవిగా పడి ఉన్న సుబ్బారావును గమనించి అతను విద్యుత్ షాక్‌కు గురైనట్టు గుర్తించాడు. వెంటనే స్థానికులకు, కుటుంబ సభ్యులకు సమాచారం అందించాడు. వీఆర్వో శ్రీపాదం సూర్యనారాయణ, గొల్లపాలెం పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కాకినాడ జీజీహెచ్‌కు తరలించారు. కేసును ఎస్సై ఎం.తులసీరామ్ నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అల్లర్లకు పాల్పడ్డారో.. చర్యలు తప్పవు



కురకాళ్లపల్లిలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న రాయవరం ఎస్సై నరేష్

రాయవరం: సార్వత్రిక ఎన్నికల ఫలితాలు వెలువడే వరకూ గ్రామాల్లో కార్డన్ అండ్ సెర్చ్ కొనసాగుతుందని రాయవరం ఎస్సై జి.నరేష్ సూచించారు. మండలంలోని వెంటూరు, కురకాళ్లపల్లి, కూర్మాపురం గ్రామాల్లో ఎస్సై జి.నరేష్ శనివారం గ్రామసభలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై నరేష్ మాట్లాడుతూ ఎన్నికల ఫలితాలు వచ్చే వరకు, వచ్చిన తర్వాత ఎలాంటి అల్లర్లు, ఘర్షణలకు పాల్పడకుండా ప్రతి ఒక్కరూ స్నేహపూర్వక, శాంతియుత వాతావరణానికి సహకరించాలన్నారు. ఎన్నికల తుది ఫలితాలు వచ్చే వరకు ఎన్నికల కోడ్ అమల్లో ఉంటుందన్నారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళికి అనుగుణంగా ప్రతి ఒక్కరూ నడుచుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఫలితాల అనంతరం ఊరేగింపులు, ఉత్సవాల వంటివి నిర్వహించరాదన్నారు. ముఖ్యంగా యువత అల్లర్లకు పాల్పడరాదన్నారు. ఎన్నికల కోడ్ అమల్లో ఉండగా, పోలీసు కేసులు నమోదైతే, యువత జీవితాలు నాశనం అవుతాయన్నారు. ఎన్నికల నిబంధనలను ఏ ఒక్కరు అతిక్రమించినా చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

వెంకన్నకు ఉయ్యాల సేవ



ఉయ్యాల సేవలో పాల్గొన్న ఆలయ చైర్‌పర్సన్ విరీతాదేవి, ఫణి దంపతులు

అమలాపురం టౌన్: స్థానిక వేంకటేశ్వరస్వామి ఆలయంలో వందలాది మంది భక్తుల సమక్షంలో శనివారం ఉయ్యాల సేవ నిర్వహించారు. ప్రతి శనివారం ఓ దంపతుల జంట స్వామి వారికి ఉయ్యాల సేవ చేయడం ఆనవాయితీగా వస్తోంది. ఆలయ ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ దూడల వెంకట విరీతాదేవి పుట్టిన రోజు సందర్భంగా పట్టణ వైఎస్సార్ సీపీ యువజన అధ్యక్షుడు దూడల ఫణి, ఆలయ చైర్‌పర్సన్ విరీతాదేవి దంపతుల చేతుల మీదుగా ఉయ్యాల సేవ శాస్త్రోక్తంగా సాగింది. కార్యక్రమంలో ఆలయ ఈవో దూనబోయిన సాయిబాబు, ఆలయ ధర్మకర్తలు యెండూరి రాఘవ, ముంగర ప్రసాద్, కాశే చంటి, ఆలయ అర్చకులు పాల్గొన్నారు.

వెంకన్న పెళ్లి కొడుకాయెనే

అమలాపురం రూరల్: మండలంలోని బండారులంక బిళ్లవారి వీధిలో వేంచేసియున్న పద్మావతి అలివేలు మంగ సమేత వేంకటేశ్వర స్వామివారి తీర్థ కల్యాణ మహోత్సవాల్లో భాగంగా శనివారం స్వామివారిని పెండ్లి కుమారుడిగా, అమ్మవార్లను పెండ్లి కుమార్తెలుగా అలంకరించారు. ముత్తైదువులచే సాంప్రదాయబద్ధంగా భక్తి శ్రద్ధలతో రోలు, రోకలితో పసుపు పోటు నిర్వహించారు. అనంతరం ప్రత్యేకంగా అలంకరించిన తిరుచ్చిపై స్వామి, అమ్మవార్లను ఉంచి పురవీధుల్లో మంగళ వాయిద్యాలు, భక్తుల గోవింద నామస్మరణల మధ్య అత్యంత వైభవంగా తిరుచ్చి సేవ జరిపారు. బిళ్ల వారి వీధి నుంచి ప్రారంభమై ఎగ్జిబిషన్ స్ట్రీట్, వీరభద్ర స్వామి గుడి సెంటర్ మీదుగా వీరభద్రపురం, శివాలయం వీధి వరకూ తిరుచ్చి సేవ సాగింది. దారి పొడవునా మహిళలు మంగళహారతులు సమర్పించారు. పేరంటాలు గడప గడపకూ వెళ్లి బొట్టు పెట్టి దేవదేవేరుల కల్యాణానికి పెండ్లి పిలుపు నిర్వహించారు. అనంతరం 2000 మందికి అన్న ప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీలు అంకం హిమ భారతి, గుత్తుల జానకీలక్ష్మి, మాజీ ఎంపీపీ ఊటుకూరి సుబ్రహ్మణ్యేశ్వర స్వామి, శ్రీనివాస బాలమిత్ర సంఘ ప్రతినిధులు చింతపట్ల బాబు, బళ్ల సత్తిరాజు, లంకాడి రాము, కటకం గణేష్, బాసిన కల్యాణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రోటరీ యువజన వారోత్సవాల ప్రారంభం

అమలాపురం టౌన్: స్థానిక రోటరీ కల్యాణ మండపంలో ఈ నెల 25 నుంచి 30వ తేదీ వరకూ జరగనున్న యువజన వారోత్సవాలు శనివారం ప్రారంభించారు. విజేతలకు జూన్ 8వ తేదీన స్థానిక రోటరీ కల్యాణ మండపంలో జరిగే కార్యక్రమంలో బహుమతులు అందించనున్నట్లు వారోత్సవాల చైర్మన్ ఆకొండి పవన్ తెలిపారు. తొలి రోజు శనివారం విద్యార్థులకు శాస్త్రీయ నృత్య పోటీలు నిర్వహించారు. క్లాసికల్, సోలో, గ్రూపు ఇలా మూడు విభాగాల్లో పోటీలు జరిగాయి. రెండో రోజు వెస్ట్రన్ డ్యాన్స్, మూడో రోజు డ్రాయింగ్, నాలుగో రోజు షటిల్ బ్యాడ్మింటన్, అయిదో రోజు భక్తి సంకీర్తనలు, ఆరో రోజు చదరంగం పోటీలను నిర్వహిస్తామన్నారు. సబ్ జూనియర్స్, జూనియర్స్, సీనియర్స్ విభాగాల్లో ఎల్‌కేజీ నుంచి పదో తరగతి విద్యార్థులకు రోజుకో పోటీ జరుగుతుందన్నారు. రోటరీ క్లబ్ పట్టణ కార్యవర్గ ప్రతినిధులు పాల్గొన్నారు. రోటరీ యువజన వారోత్సవాలను క్లబ్ అధ్యక్షుడు పోలిశెట్టి నాగభూషణం ప్రారంభించారు. అనంతరం శాస్త్రీయ నృత్య ప్రదర్శనలో ప్రతిభ చాటిన చిన్నారులను క్లబ్ కార్యదర్శి శ్రీఖాకోళపు రామ సతీష్, కోశాధికారి కూచిమంచి శశిధర్ శ్రీరామ్, వారోత్సవాల కమిటీ చైర్మన్ పవన్‌లు అభినందించారు.

ఖరీఫ్ సాగుకు సర్వం సిద్ధం

- 52,745 ఎకరాల్లో సాగుకు సమాయత్తం
- 3,650 క్వింటాళ్ల సబ్సిడీ విత్తనాల సరఫరాకు ప్రణాళిక
- రైతు భరోసా కేంద్రాల ద్వారా విత్తనాల పంపిణీకి చర్యలు



ఖరీఫ్ సాగుకు సిద్ధం చేసుకున్న పంట పొలం

రామచంద్రపురం రూరల్: రబీ సీజన్‌లో ఆశాజనకంగా పంటలు పండటం ప్రభుత్వం మద్దతు ధరతో ధాన్యం కొనుగోలు చేస్తుండటంతో రైతులు ఉత్సాహంగా ఖరీఫ్ సాగుకు సర్వం సిద్ధం చేసుకుంటున్నారు. దానికనుగుణంగా వ్యవసాయ అధికారులు ప్రణాళికలు సిద్ధం చేసుకుని రైతులకు పూర్తి స్థాయిలో సహకరించేలా చర్యలు చేపట్టారు. వర్షాలు కూడా పడుతుండటంతో దుక్కులు చేపట్టి పొలాలను సాగుకు సిద్ధం చేసుకుంటున్నారు. ఈ ఏడాది రామచంద్రపురం నియోజకవర్గంలో సుమారు 52,745 ఎకరాల్లో వరి సాగుకు రైతులు సిద్ధమవుతున్నట్లు వ్యవసాయ అధికారులు ఆయా రైతుల కోసం ప్రభుత్వం నుంచి సుమారు 3,650 క్వింటాళ్ల వరి, ఇతర విత్తనాలను సరఫరా చేసేందుకు ప్రణాళిక రూపొందించారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రూపకల్పన చేసిన రైతు భరోసా కేంద్రాల ద్వారా విత్తనాలు సరఫరా చేసేందుకు పూర్తి ఏర్పాట్లు చేశారు.

విత్తనాల కోసం ప్రణాళిక..

ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో నియోజకవర్గంలో సుమారు 52,745 ఎకరాల్లో సాగుకు సమాయత్తమవుతున్నట్లు వ్యవసాయ అధికారులు అంచనాలు వేశారు. ఖరీఫ్ వరి సాగుకు అనుకూలమైన ఎంటీయూ 7029(స్వర్ణ), ఎంటీయూ 1318, ఎంటీయూ 1061 తదితర రకాల వరి విత్తనాలు సుమారు 3,650 క్వింటాళ్లు సరఫరా చేసేందుకు ప్రణాళిక సిద్ధం చేశారు.

మండలాల వారీగా సాగు, విత్తనాల పంపిణీ లక్ష్యం..

మండలం	ఖరీఫ్ సాగు (ఎకరాల్లో)	విత్తనాల పంపిణీ (క్వింటాళ్లలో)
రామచంద్రపురం	18,128	1,100
కె.గంగవరం	15,687	1,050
కాజులూరు	18,930	1,500

తగిన ప్రణాళికతో సిద్ధం



ఈ ఏడాది ఖరీఫ్ సాగుకు సంబంధించిన ప్రణాళిక వ్యవసాయ శాఖ పరంగా సిద్ధం చేయడం జరిగింది. రైతులకు అవసరమైన వరి విత్తనాలు నియోజకవర్గంలోని 21 రైతు భరోసా కేంద్రాల ద్వారా సరఫరా చేసేందుకు ఉన్నతాధికారులకు నివేదికలు పంపించడం జరిగింది. రైతులకు ఎటువంటి ఇబ్బంది కలుగకుండా సహకరించేందుకు వ్యవసాయ శాఖ అధికారులు, సిబ్బంది సర్వ సన్నద్ధంగా ఉన్నారు.

– ఎస్.సత్యప్రసాద్, ఏవో, రామచంద్రపురం మండలం

శిథిల వంతెనను పునర్నిర్మించాలి



ఆర్యావటం కూరాడ డ్రైన్‌పై శిథిలావస్థలో ఉన్న వంతెన

కాజులూరు: ఆర్యావటంలో ముత్తావారి గరువు వద్ద కూరాడ డ్రెయిన్‌పై శిథిలావస్థలో ఉన్న వంతెనను పునర్నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు. ముత్తావారి గరువు నుంచి ప్రధాన గ్రామమైన ఆర్యావటం వెళ్లేందుకు సుమారు 20 ఏళ్ల క్రితం అధికారులు డ్రెయిన్‌పై కాలిబాట వంతెనను నిర్మించారు. నిర్మాణ సమయంలో నాణ్యతా ప్రమాణ లోపం కారణంగా కొద్ది రోజులకే శిథిల దశకు చేరుకుంది. ప్రస్తుతం వంతెనకు ఇరువైపులా రక్షణ గోడలు విరిగిపోయి అప్రోచ్‌లు కరిగిపోయి ఉన్నాయి. సైకిల్, బైక్ వంటి వాహనాలు ప్రయాణించాలంటే ఏ మాత్రం వీలు లేకుండా ఉంది. పాదచారులు సైతం తప్పనిసరి పరిస్థితుల్లో భయం భయంగా వంతెనపై నుంచి ప్రయాణాలు సాగిస్తున్నారు. అధికారులు స్పందించి వంతెన పునర్నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

ఆలయ వార్షికోత్సవం



అభయ ఆంజనేయస్వామి సన్నిధిలో పూజల్లో పాల్గొన్న దంపతులు

రామచంద్రపురం రూరల్: మండలంలోని వెంకటాయపాలెం శివారు రామనర్సుతోట గ్రామంలో కాలువగట్టుపై వేంచేసియున్న అభయ ఆంజనేయ స్వామి ఆలయ తృతీయ వార్షికోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. గణపతి పూజ, పంచామృత అభిషేకాలు, తమలపాకు పూజ, సింధూర పూజలు నిర్వహించారు. సాయంత్రం అభయాంజనేస్వామివారికి పల్లకీలో గ్రామోత్సవం నిర్వహించారు. స్వామికి అప్పాలు, బూరెలు నైవేద్యం సమర్పించారు. 50 మంది దంపతులు పూజల్లో పాల్గొన్నారు. భారీ ఎత్తున అన్నసమారాధన నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ నిర్మాణకర్తలు అనుసూరి వెంకటరమణారావు, లక్ష్మీరమణమ్మ దంపతులు, సర్పంచ్ యల్లమిల్లి సతీష్‌కుమారి, రవికుమార్ దంపతులు, మాజీ సర్పంచ్ కొప్పిశెట్టి శ్రీలక్ష్మి, శ్రీను దంపతులు, గ్రామ పెద్దలు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

దరఖాస్తుల స్వీకరణ

ముమ్మిడివరం: పారా లీగల్ వలంటీర్ల నియామకానికి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు మండల లీగల్ సర్వీసెస్ కమిటీ చైర్మన్ మహమ్మద్ రహంతుల్లా పేర్కొన్నారు. జాతీయ న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు ముమ్మిడివరం, కాట్రేనికోన, ఐ.పోలవరం మండలాల్లో ఏడాది కాలం పాటు ప్రజలకు న్యాయ సేవలు అందించేందుకు పారా లీగల్ వలంటీర్లను నియమిస్తున్నామన్నారు. పదోతరగతి ఉత్తీర్ణులై 18 ఏళ్లు నిండినవారు జూన్ 15వ తేదీలోపు మండల న్యాయ సేవాధికార కమిటీకి దరఖాస్తు చేసుకోవాలన్నారు. సేవా దృక్పథం కలిగిన వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

విద్యార్థులు సమాజ సేవ అలవరచుకోవాలి

ఉప్పలగుప్తం: విద్యార్థులు చిన్న వయసు నుంచే సమాజసేవ అలవరచుకోవాలని అమలాపురం రూరల్ సీఐ పి.వీరబాబు అన్నారు. ఈ నెల 13న జరిగిన సార్వత్రిక ఎన్నికల విధుల్లో పాల్గొన్న పలు కళాశాలల విద్యార్థులకు ఎస్పీ సునరావు శ్రీధర్ అందించిన ప్రోత్సాహకాలను ఆయన ఎస్‌ఐ కేఎం జోషితో కలసి ఉప్పలగుప్తం పోలీస్‌స్టేషన్‌లో శనివారం అందజేశారు. పోలీసులకు సహాయకులుగా వలంటీర్ సేవలు అందించిన విద్యార్థులకు ప్రశంసా పత్రాలు, రూ.500 నగదును అందించి అభినందించారు.

వైభవంగా లక్ష కుంకుమార్చన



కల్యాణదుర్గ అమ్మవారి ఆలయంలో లక్ష కుంకుమార్చన చేస్తున్న మహిళలు

అమలాపురం టౌన్: పట్టణంలోని హౌసింగ్ బోర్డు కాలనీలో వేంచేసి ఉన్న కల్యాణ దుర్గ అమ్మవారి ఆలయ 28వ ప్రతిష్ఠా మహోత్సవం సందర్భంగా అమ్మవారి సన్నిధిలో లక్ష కుంకుమార్చన పూజ శనివారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అధిక సంఖ్యలో మహిళలు తరలి వచ్చి అమ్మవారికి సామూహిక కుంకుమ పూజలు చేశారు. ఆలయ కమిటీ భక్తులకు పూజా సామాగ్రి సమకూర్చింది. కుంకుమార్చన అనంతరం భక్తులకు అమ్మవారి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ప్రతిష్ఠా మహోత్సవాన్ని పురస్కరించుకుని ఆలయాన్ని పూల మాలలు, మామిడి తోరణాలతో మంగళప్రదంగా ముస్తాబు చేశారు.

భారీ అన్నదానం

తాళ్లరేవు: శ్రీదేవీ, భూదేవీ సమేత కేశవస్వామివారి కల్యాణోత్సవాలు ఘనంగా ముగిసిన నేపథ్యంలో శనివారం భారీ అన్నదానం నిర్వహించారు. తాళ్లరేవు పరిసర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చి స్వామివారి ప్రసాదాన్ని స్వీకరించారు. వారం రోజుల పాటు స్వామివారి కల్యాణోత్సవాలను వైభవంగా నిర్వహించేందుకు సహకరించిన వారందరికీ ఆలయ కార్యనిర్వహణాధికారి యర్రా వెంకటేశ్వరరావు కృతజ్ఞతలు తెలియజేశారు.